క్లుప్తంగా

రేపు గూడూరులో 'జగనన్నకు చెబుదాం'

గూడూరు: గూడూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆవరణలోని రైతు కమ్యూనిటీ భవనంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.విజయప్రసాద్ తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అధికారులు జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట

గూడూరు: వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచి రాష్ట్ర ప్రజల ఆరోగ్యం పట్ల తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి మరో సారి స్పష్టం చేశారని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. వైఎస్సార్ ఆరో గ్య శ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచిన సందర్భంగా సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీఎం ప్రసంగాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆరోగ్య సిబ్బందితో కలిసి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఆరోగ్య శ్రీ నూతన కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, ఎంపీడీవో డి.సుబ్బారావు, తహసీల్దార్ బి.విజయప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్నకు సహస్ర దీపాలంకరణ సేవ



కోడూరు: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారికి సోమవారం సహస్ర దీపాలంకరణ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గోదాదేవి అమ్మవారి ప్రత్యేక పూజలు జరిపి, ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు తిరుప్పావైలోని పాశురాలను భక్తులకు వివరించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకిలో ఆలయంలో చుట్టూ ఊరేగించారు. ముందుగా స్వామి వార్లకు నక్షత్ర హారతి ఇవ్వగా, తరువాత మహిళలు వరుస క్రమంలో దీపాల సేవలను నిర్వహించి భక్తిభావం చాటారు. గర్భాలయంలోని మూలమూర్తులకు చేసిన ప్రత్యేక అలంకారం ఆకట్టుకుంది. ఆలయ ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మైనార్టీ హక్కుల పరిరక్షణకు కృషి



మచిలీపట్నంటౌన్: ముస్లిం మైనార్టీల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని 33వ డివిజన్ కార్పొరేటర్ మీర్ అస్గర్ అలీ అన్నారు. నగరంలోని 33వ డివిజన్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముస్లిం మైనార్టీ హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. అస్గర్‌అలీ మాట్లాడుతూ సీఎం జగన్ మైనార్టీల హక్కులను పరిరక్షిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఉర్దూను రెండోభాషగా గుర్తించారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముస్లింల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు మీర్జా రియాజ్ హుస్సేన్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ సదురుద్దీన్, నాయకులు రబ్బానీ, సచివాలయ వీఆర్వో ఉమ, పాఠశాల హెచ్ఎం సల్మా పాల్గొన్నారు.

80 శాతం సబ్సిడీపై మినుము విత్తనాలు



పెడన: మిచాంగ్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై మినుము విత్తనాలను అందజేస్తోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొండవీటి నాగబాబు అన్నారు. చేవేంద్రలోని రైతు భరోసా కేంద్రంలో సోమవారం మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్చుతరావు, పార్టీ నాయకుడు గరికపాటి వెంకటరామానాయుడులతో కలిసి రైతులకు మినుము విత్తనాలను అందజేశారు. విత్తనాలు అవసరమైన వారు ఆధార్ కార్డు, పట్టదారు పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీలను ఆర్బీకేల్లో అందజేసి విత్తనాల ను పొందాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ దుర్గాభవాని, లోయ ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

శరవేగంగా నియోజకవర్గ అభివృద్ధి

- బందరుపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక ప్రేమ
- ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పేర్ని నాని, మేయర్ వెంకటేశ్వరమ్మ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి తదితరులు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మచిలీపట్నం ప్రాంతంపై ప్రత్యేక ప్రేమ చూపిస్తున్నారని, దీంతో శరవేగంగా నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిని సర్వజన ఆస్పత్రిగా పునర్నిర్మాణం చేసేందుకుగానూ రూ.8.06 కోట్లు నాడు - నేడు, సీఎస్ఎస్, నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు, రూ.4.60 కోట్లతో బాలల సత్వర చికిత్స కేంద్రం ప్రహరీ, ఇతర అభివృద్ధి పనులకు నాడు - నేడు, సీఎస్ఎస్, నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో చేపట్టే పనులకు సంబంధించిన శిలాఫలకాలను సోమవారం ఆయన ఆవిష్కరించారు.

అందుబాటులో 10 విభాగాల వైద్యులు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే సదుద్దేశంతో సీఎం జగన్ మచిలీపట్నంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిని సర్వజన ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. దీనిలో భాగంగా ఆసుపత్రిలో మెరుగైన వసతులు కల్పించేందుకు దాదాపు రూ. 12 కోట్ల నిధులను మంజూరు చేశారని చెప్పారు. ఈ నిధులతో ఆస్పత్రిలో ఎలక్ట్రికల్, సివిల్, శానిటేషన్, మైనర్ రిపేర్లు, ఆక్సిజన్ సరఫరా, మార్చురీలో మల్టిపుల్ ఫ్రీజర్ రూమ్‌లు, ఫైర్ అలారం, అన్ని వార్డుల్లో ఇంటర్నెట్ సౌకర్యం, మందుల దుకాణం వంటి సౌకర్యాలు ఏర్పాటవుతాయన్నారు. అలాగే ఆస్పత్రిలో కోటి రూపాయలతో నిర్మించిన భవనంలో బాలల సత్వర చికిత్స కేంద్రం ఏర్పాటు చేయటం జరిగిందని ఈ కేంద్రంలో బుద్ధి మాంద్యం ఉన్న పిల్లలకు వైద్యంతో పాటు అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 18 ఏళ్ల యువత వరకు అత్యవసర వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. దీనిలో 10 మంది వివిధ విభాగాల వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. వీరిలో ఆరుగురు వైద్యులు విధుల్లో ఉన్నారని మరో నలుగురిని నియమించటం జరుగుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఓపీ చీటీలు రాసే విభాగంలో స్మార్ట్ ఫోన్ తెస్తేనే రిజిష్టర్ చేయడాన్ని ఆరా తీశారు. రోగి వచ్చిన ప్రతిసారి సెల్‌ఫోన్‌తోనే వచ్చి నమోదు చేసుకోవటం ఇబ్బందిగా ఉంటుందని, ఆధార్‌కార్డు తీసుకువస్తే గతంలో వారు ఏయే వైద్యసేవలు పొందారనే వివరాలు నమోదయ్యేలా యాప్‌ను మార్పు చేయాల్సిన అవసరంపై సిబ్బందితో చర్చించారు. ఈ విషయాన్ని సీఎం జగన్‌కు ఉన్నతాధికారులు వివరించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్ని నాని ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించి అక్కడున్న సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మార్కెట్ యార్డు చైర్మన్ గాడెల్లి డేవిడ్‌శామ్యూల్, మాజీ డెప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత, లంకా సూరిబాబు, మాజీ మునిసిపల్ చైర్మన్ షేక్ సలార్‌దాదా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనంద బాబు(జానీ), రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, వైస్ ప్రిన్సిపాల్ డి ఆశాలత, డెప్యూటీ సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, ఆర్ఎంవో నిరంజన్‌కుమార్, వైద్య ఆరోగ్యశాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ డి.బలరామిరెడ్డి, డీఈ ఎం.గోవిందయ్య, ఆస్పత్రి అభివృద్ధి కమి టీ సభ్యులు చలమలశెట్టి గాంధీ, చీలి రవీంద్ర, రాంబాబు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా షష్ఠి వేడుకలు ప్రారంభం



కోడూరులో ప్రత్యేక అలంకారంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



నాగాయలంకలో పూజలు చేస్తున్న అర్చకుడు



బంటుమిల్లిలో స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

నాగాయలంక: మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లో సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక పురాతనమైన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణేశ్వర స్వామి దేవస్థానంలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు కనగాల కుటుంబరావు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, షష్ఠి పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ ప్రాంగణంలోని నాగ పుట్టలలో పాలు పోసి పూజలు చేశారు. దాతల సహకారంతో నిత్యాన్నదాన ప్రసాద వితరణ సేవా కమిటీ ఆధ్వర్యంలో పేద వృద్ధులు, దివ్యాంగులకు అన్నప్రసాద వితరణ జరిపారు.

కోడూరులో..

కోడూరు: సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలను సోమవారం కోడూరులో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప స్వామివారి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కోమ్మూరి శ్రీనివాసశర్మ గురుస్వామి పర్యవేక్షణలో సుబ్రహ్మణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకాలను కనులపండువగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అభిషేకాలు చేశారు. స్వామివారికి బంగారు ఆభరణాలతో చేసిన అలంకారం విశేషంగా ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో అయ్యప్ప దీక్ష దారులు, భక్తులు పాల్గొన్నారు.

అన్న సమారాధనలు

పెడన: సోమవారం ఉదయం నుంచే భక్తులు పలు ప్రాంతాల్లోని నాగేంద్ర స్వామి సన్నిధిల్లోనూ, పాము పుట్టల్లో పాలు పోసి తమ భక్తిని చాటుకున్నారు. పట్టణంలోని బ్రహ్మపురం విజయానంద డిగ్రీ కళాశాల పక్కన నాగేంద్రస్వామి పుట్ట వద్ద, దక్షిణ తెలుగుపాలెంలోను, ఒకటో వార్డు భజన గుడివద్ద, తోటమూలలోని చిట్టూరి బాబూరావు తోటలోని నాగేంద్రుని పుట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ వారు, నిర్వాహకులు ఆయా ప్రాంతాల్లో భారీ ఎత్తున అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు.

వైభవంగా కల్యాణోత్సవం

బంటుమిల్లి: మండల పరిధిలోని నాగేశ్వరరావుపేట పంచాయతీ శివారు జానకీరామపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లీ,దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారి షష్ఠి ఉత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పండితులు వీరుభొట్ల వెంకట కుటుంబ సత్యనారాయణ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమ పూజ, గోపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తులకు ఆలయ ట్రస్టీ గంగిశెట్టి దేవానంద్ దంపతుల దీక్ష ధారణతో వార్షిక శాంతికల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాలు ఈ నెల 27వ తేదీ వరకు జరుగుతాయని ట్రస్టీ దేవానంద్ పేర్కొన్నారు.

విశేష పూజలు

కృత్తివెన్ను: శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి వారి షష్ఠి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని పుట్టల్లో పాలుపోసి స్వామివారిని దర్శించుకున్నారు. మండల పరిధిలోని గరిశపూడి, గాంధీనగరం, మాట్లాం, లక్ష్మీపురం, పోడు, చినగొల్లపాలెం తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

కార్తికేయుని స్వామివారి ఊరేగింపు



మోపిదేవిలో మయూర వాహనంపై సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు

మోపిదేవి: మోపిదేవిలో వేం చేసి ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని ప్రత్యేకంగా మయూరు వాహనంపై సోమవారం ఊరేగించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో స్వామివారి దివ్య కల్యాణోత్సవం నిర్వహించిన అనంతరం సాయంత్రం మయూర వాహనంపై రావివారిపాలెం వరకు ఊరేగించారు. ఈ సందర్భంగా కేరళ నృత్య కళాకారుల సందడి, మేళతాళాలు, బాణాసంచా మోతతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరిటెండెంట్ బొప్పన సత్యేనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో సీఐ నాగప్రసాద్, ఎస్ఐ కెవివి సత్యనారాయణ పోలీస్ బందోబస్తు నిర్వహించారు .

అభివృద్ధి పథంలో జగనన్న కాలనీలు



ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పేర్ని కిట్టు, నాయకులు

కోనేరుసెంటర్: జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంటుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు తెలిపారు. మండల పరిధిలోని కరగ్రహారం జగనన్న కాలనీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కిట్టు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. తొలుత రూ.20 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.202.85 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు, ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు.

ఈ సందర్భంగా కిట్టు మాట్లాడుతూ.. మాట తప్పని మడమ తిప్పని నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి పేదవాడు సొంతింట్లో ఉండాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకునేలా కృషి చేస్తున్నారని చెప్పారు. అలాంటి ముఖ్యమంత్రి మన ఆంధ్రప్రదేశ్‌కు ఉండడం మనందరి అదృష్టమన్నారు. ప్రతి పేదవాడి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ శొంతి ఫరీద్, మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షుడు బలగం బాబు, కొండలు, బలగం సామెలు, బెజవాడ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తీర్థయాత్రలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు

గుడివాడ టౌన్: ధనుర్మాసం సందర్భంగా సప్త శ్రీనివాస తీర్థయాత్రలకు గుడివాడ ఆర్టీసీ డిపో నుంచి ప్రతి శనివారం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ జి.రాజేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు తెల్లవారు జామున 4 గంటలకు డిపోలో బయలుదేరి అప్పనపల్లి, యానం, మండపేట, వాడపల్లి, అన్నవరపాడు, కొడమంచిలి, అబ్బురాజుపాలెంలో సందర్శనలు పూర్తిచేసుకుని తిరిగి రాత్రి 10 గంటలకు గుడివాడ చేరుతుందన్నారు. టికెట్ ధర రూ.650గా నిర్ణయంచినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 73829 03299, 91771 01904లో సంప్రదించాలని కోరారు.

దుప్పట్ల పంపిణీ



విద్యార్థులతో దాత స్వరాజ్యలక్ష్మి, పులి శ్రీనివాసరావు

పమిడిముక్కల: మంటాడ మెయిన్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు మేరుగ స్వరాజ్యలక్ష్మి రూ.10 వేల విలువైన దుప్పట్లు అందజేశారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో 72 మంది విద్యార్థులకు దుప్పట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. దాత స్వరాజ్యలక్ష్మికి హెచ్ఎం ప్రకాష్‌కుమారి కృతజ్ఞతలు తెలిపారు. రోటరీ మాజీ అధ్యక్షుడు పులి శ్రీనివాసరావు, ఎన్‌జీవో కోడూరు గౌరి, ఉపాధ్యాయులు ఎస్.వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు. మండలంలోని చోరగుడి గ్రామంలో షేరింగ్ అండ్ కేరింగ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పేదలకు చేతనైన సహాయం చేయాలనే సంస్థ ఆలోచన అభినందనీయమని సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు హసన్ అహ్మద్, కత్తిక నాగేశ్వరరావు, అమ్మిరెడ్డి శివయ్య పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలతో ప్రపంచ శాంతి



వస్త్రాలు అందజేసిన ఐవీఎం సురేష్, ఎస్ఐ చినబాబు

లక్ష్మీపురం(చల్లపల్లి): ఏసు క్రీస్తు బోధనలతో ప్రపంచ శాంతి, సహనం లభిస్తాయని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేముల పల్లి సురేష్ అన్నారు. లక్ష్మీపురంలో ఈఆర్ఈ మినిస్ట్రీస్ నిర్వాహకులు జి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీపురం, శ్రీనగర్, చింతలమడ, కొడాలి, పాత మాజేరు, చల్లపల్లి గ్రామాలకు చెందిన 70 మంది నిరుపేద వితంతువులు, వృద్ధులకు వస్త్రదానం చేశారు. ఎస్ఐ సీహెచ్.చినబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో పాస్టర్లు పాల్గొని క్రీస్తు సందేశం వినిపించారు. క్రైస్తవ గీతాలు ఆలపించారు.

జగనన్న పాలనలో పేదల జీవితాల్లో వెలుగులు



7వ డివిజన్‌లో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) అన్నారు. నగరంలోని 7, 17 డివిజన్లలో సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో పేర్ని కిట్టు మాట్లాడారు. పేదలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి సీఎం జగన్ ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే అధికారం చేపట్టిన నాటి నుంచి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై దృష్టిసారించి ఆయా రంగాల్లో విప్లవాత్మక మార్పులకు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు చైర్మన్ గాడెల్లి డేవిడ్‌శామ్యూల్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు, మాజీ చైర్మన్ బొర్రా విఠల్, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు కాగిత జవహర్‌లాల్ (నెహ్రూ), మేకల సుబ్బన్న, కార్పొరేటర్ పడమటి రేవతి, 17, 7 డివిజన్ల ఇన్‌చార్జిలు పల్లపోతు చంద్రకుమారి, పడమటి రమేష్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఆయా డివిజన్లలో జరిగిన అభివృద్ధి పనుల బోర్డులను, పార్టీ జెండాలను పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ అందజేశారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శనలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఎగ్జిబిషన్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎంఈవో దుర్గాప్రసాద్



కృత్తివెన్ను మండలం సంగమూడి పాఠశాలలో మాట్లాడుతున్న విద్యార్థిని

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయిలో నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు సృజనాత్మకతతో తయారు చేసిన ప్రదర్శనలు అలరించాయి. ఎంఈవో-1, 2లు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సైన్స్ ప్రదర్శనను ప్రారంభించారు. ఎంఈవో - 1 బి.త్రిపురసుందరీదేవి మాట్లాడుతూ మండల స్థాయిలో నిలిచిన విజేతలు ఈ నెల 20వ తేదీన జిల్లా స్థాయి లో జరిగే సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటారన్నారు. విజేతలకు ఎంపీపీ వి.చినబాబు, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కాలేజీల ప్రిన్స్‌పాల్స్ డాక్టర్ ఎస్.జగన్‌మోహన్ రావు, కృష్ణకిషోర్, వైస్ ఎంపీపీ కె.లలిత, ఎంపీటీసీ ఎండీ.కమాల్‌బాషా, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.మహేష్, ఎంఈఓ-2 వెంకటేశ్వరరావులు బహుమతులు అందచేసి అభినందించారు. విజేతలకు ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం సభ్యులు మెమొంటోలు బహుకరించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు డి.సుధాకర్, బీఎస్‌పీ మల్లేశ్వరరావు, మూర్తిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

విజ్ఞానంపై దృష్టి సారించాలి..

కృత్తివెన్ను: విద్యార్థులు చదువుతో పాటు విజ్ఞానంపై దృష్టి సారించాలని ఎంఈవో ఎంఎస్‌కే.ప్రసాద్ అన్నారు. మండల స్థాయిలో విజ్ఞాన ప్రదర్శనను సంగమూడి ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తాము తయారు చేసిన సాంకేతిక విజ్ఞాన పరికరాలను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఎంఈవో త్రిపురసుందరీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్‌పై మరింత అవగాహన పెరగాలి

మచిలీపట్నంటౌన్: విద్యార్థులకు సైన్స్‌పై మరింత అవగాహన పెరగాలని మండల విద్యాశాఖాధికారి ఎంవీఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. మండల స్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శన నగరంలోని కాలేఖాన్‌పేట జీవీఎస్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ ప్రదర్శన ప్రారంభించిన ఎంఈవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. మూడు రంగాల్లో ఈ పోటీ ప్రదర్శన నిర్వహించటం అభినందనీయమన్నారు. వ్యక్తిగత విభాగంలో 22 ప్రదర్శనలు, గ్రూప్ విభాగంలో 25 ప్రదర్శనలు, టీచర్ల విభాగంలో ఐదు ప్రదర్శనలు ఇచ్చారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ నెల 20న ఉయ్యూరులో జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ జరుగుతుందన్నారు. హైస్కూల్ హెచ్ఎం శోభారాణి, ఉపాధ్యాయుడు వైఎస్ఆర్‌కె గురుప్రసాద్ పాల్గొన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా లేడియాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు వ్యవహరించారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం పాలన



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న రాజీవ్, చైర్‌పర్సన్ నాగకుమారి తదితరులు

పెడన: పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని రాష్ట్ర మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారితో కలిసి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ ఫలాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరిస్తూ వారు పేర్కొన్న సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా మన జగనన్న సంక్షేమ పాలనను అందిస్తున్నారని, అటువంటి మన సీఎంకు అండగా నిలబడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, పిచ్చిక సతీష్‌బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన అవసరం



పెడనలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



చల్లపల్లిలో నమూనా పోలింగ్..

పెడన: ఎల్లకానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లపై ప్రజలకు అవగాహన అవసరమని అధికారులు తెలిపారు. ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా పెడనలో సోమవారం ఎన్నికల సిబ్బంది అవగాహన కల్పించారు. స్థానిక భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానాన్ని వివరించారు. వార్డు కౌన్సిలర్ పిచ్చిక సతీష్‌బాబు, హైస్కూల్ హెచ్ఎం ఎస్.ఉషా, బూత్ లెవల్ అధికారు లు, రెవెన్యూ, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

రామానగరంలో అవగాహన

లక్ష్మీపురం(చల్లపల్లి): ఓటర్లకు ఈవీఎంల వినియోగం, వీవీ పాట్స్ పనితీరుపై అవగాహన కల్పిస్తున్నట్లు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. లక్ష్మీపురం శివారు రామానగరంలో సోమవారం ఓటర్లతో నమూనా పోలింగ్ నిర్వహించారు. ఈవీఎంలో వేసిన ఓటు వీవీ ప్యాట్‌లో చూపించి ఓటర్లకు స్పష్టతనిచ్చారు. ఈ నెల 13 నుంచి 2024 జనవరి 20వరకు ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వో కిరణ్, సత్యనారాయణ పాల్గొన్నారు.